www.prajasakti.com
ప్రజాశక్తి
5
మంగళవారం 2 మే 2023



వైఎస్‌ఆర్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి

ప్రజాశక్తి - కడప



కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వి శ్రీనివాస ఆంజనేయ మూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ కోర్టులో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా పనిచేస్తూ బదిలీపై కడప కోర్టుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వచ్చారు. 1995 జూన్ నెల 1వ తేదీన తొలిసారిగా విజయవాడ కోర్టులో ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మంగళవారం కడప న్యాయవాదులతో భేటీ కానున్నట్లు కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.టి. జాన్సన్ కెనడి తెలిపారు. భేటీకి న్యాయవాదులందరూ తప్పక హాజరు కావాలని వారు కోరారు.

నట్టేట ముంచిన అకాల వర్షం

11,944 ఎకరాల్లో పంట నష్టం
అత్యధికంగా దెబ్బతిన్న వరి, ఉల్లి, అరటి
166 ఎకరాల్లో ఉద్యాన పంటలు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో అకాలవర్షం బీభత్సాన్ని సృష్టించింది. 14 రకాల వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి 11,944 ఎకరాల్లో నష్టం వాటిల్లింది వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్ష సూచన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి 11,778 ఎకరాల్లో వ్యవసాయ, 166 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని 72 గ్రామాల పరిధిలో వ్యవసాయ పంటల్లో వరి, నువ్వు, ఉద్యాన పంటల్లో అరటి, ఉల్లి, పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. ఇందులో ప్రధానంగా వరి 10,510 ఎకరాలు, వేరుశనగ 48.75ఎకరాలు, పెసలు 172.5 ఎకరాలు, నువ్వులు 28.75 ఎకరాలు, కొర్రలు 20 ఎక రాలు, మొక్కజొన్న 37 ఎకరాలు నువ్వులు, 575 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఇందులో 3,400 ఎకరాల్లో తీవ్రనష్టం వాటిల్లినట్లు వ్యవ సాయశాఖ అంచనా వేస్తోంది. ఇదేతరహాలో జిల్లాలోని చింతకొమ్మదిన్నె, వేంపల్లి, ముద్దనూరు, ఒంటిమిట్ట, కాశినాయన, పోరుమామి ళ్ల మండలాల్లోని 137 మంది ఉద్యాన రైతులకు సంబంధించిన 65 ఎకరాల్లో ఉల్లి, 30 ఎకరాల్లో అరటి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈమేరకు జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు ప్రాథమిక అంచనా నిమిత్తం అంచనా వేసినట్లు తెలుస్తోంది. వర్షం వెలి సిన అనంతరం పంటనష్టాల్ని ఎన్యూమరేషన్ చేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలుస్తోంది.



చాపాడు : వర్షానికి తడవకుండా పసుపు పంటకు పట్టలు కప్పిన రైతులు

తడిసిన వరి ధాన్యం
నూర్పిడి చేసిన పంటలు నీటిపాలు

ప్రజాశక్తి - చాపాడు

వర్షం దెబ్బకు రైతులు విల విల లాడిపోయారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన ఎడ తెరిపిలేని వర్షానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా రకాల పంటలు నూర్పిడి చేసిన రైతులు ఇబ్బందులు పడ్డారు. వాతవరణంలో వచ్చిన మార్పుల కారణంగా వర్షం కురవడంతో నియోజకవర్గ వ్యాప్తంగా 15 వేల ఎకరాల వరకు వరి పంట రెండువేల ఎకరాల్లో నూగు పంట, పదివేల ఎకరాల్లో మినుము, పెసర, సోద్ద, కొర్ర వంటి పంటలు రైతులు సాగు చేపట్టారు. సాగైన వరి, నూగు పంట ప్రస్తుతం నూర్పిడి దశలో ఉంది. రైతులు వరి పంట నూర్పిడి చేసి వరి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. పసుపు పంటను ఉడికించి ఆరబెట్టారు. వర్షం ఒక్కసారిగా కువరడంతో ధాన్యాన్ని, పసుపును కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వేసవి సీజన్‌లో సాగైన వరి పంట ప్రస్తుతం నూర్పిడి పనులు ప్రారంభించారు. వర్షంతో నూర్పిడి చేసిన వరి ధాన్యం వర్షార్పణమైంది. వరి ధాన్యాన్ని రోడ్లు, ఖాళీ ప్రదేశాలలో ఆరబోతకు ఉంచారు. వర్షం పడగానే ప్లాస్టిక్ పట్టాలను వేసి వరి ధాన్యాన్ని కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. అధిక వర్షం కావడంతో చాలా వరకు వరి ధాన్యం తడిసింది. సోమవారం వర్షం తగ్గిన తర్వాత తిరిగి వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునే ప్రయత్నం చేశారు. మైదుకూరు వద్ద కడప – కర్నూలు హైవే అనుసంధాన రోడ్డపై టన్నుల కొద్ద వరిధాన్యం ఆరబోశారు. మండల పరిధిలో నూర్పిడి చేయని సొద్ద, కొర్ర, వరి పంటలు నేలకొరిగాయి.

548 ఎకరాల్లో పంట నష్టం

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి 548 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. సోమవారం తహశీల్దార్ సుభాని, వ్యవసాయ అధికారి మ్యాగీ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి వరి, వేరుశెనగ, నూగు పంటలు దెబ్బతిన్నాయన్నారు. వేసవి సీజన్‌లో వరి, నూగు, మినుము 1411హెక్టార్లలో సాగు కాగా, 219.6 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు పంపించి రైతులకు తగు న్యాయం చేస్తామని సూచించారు. వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు



లింగాల : వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

180 ఎకరాల్లో వరికి నష్టం

లింగాల : ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు మండల పరిధిలోని పార్నపల్లి లో 180 ఎకరాల్లో వరి నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు సోమవారం గ్రామంలో రెవెన్యూ ఆర్‌బికె అధికారులు పంట నష్టం ఎంత వాటిల్లిందనే దానిపై నివేదిక తయారు చేశామన్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దువ్వూరులో దెబ్బతిన్న పంటల పరిశీలన : మండలంలో రెండు రోజులుగా కురిసిన వరి, నూగు, కొర్ర పంటలు దెబ్బతింది. గ్రామాల వారికి తహశీల్దార్ రత్నకుమారి, వ్యవసాయాధికారి అమర్‌నాథరెడ్డి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంటనష్టం వివరాలను సేకరించి నివేదినక ప్రభుత్వానికి పంపిత్వరలో బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

25 ఎకరాల్లో నీట మునిగిన వరి

చెన్నూరు : చెన్నూరు, శివాల్‌పల్లె రెవన్యూ గ్రామాల్లో సుమారు 25 ఎకరాల్లో వరి నష్టం వాటిల్లిందని ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ పి. మహమ్మద్‌అలీఖాన్, వ్యవసాయాధికారి శ్రీదేవితో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.



చెన్నూరు : పంటనష్టం గురించి ఆరాతీస్తున్న కడప ఆర్‌డిఒ

ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలి



బిజెపి పాలిత రాష్ట్రాల్లో అవినీతి కంపు
సిఐటియు జిల్లా వ్యవస్థాపకులు నారాయణ
ర్యాలీలో కదం తొక్కిన కార్మిక లోకం
ఉత్సాహ భరితంగా ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాల్లో అవినీతి కంపు కొడుతుందని, ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు జిల్లా వ్యవస్థాపకులు బి.నారాయణ అన్నారు. సోమవారం మే సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ర్యాలీలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ర్యాలీలో కార్మిక లోకం కదం తొక్కింది. బ్యాండు, బాణా సంచా పేలుళ్ల మధ్య ఉత్సాహ భరితంగా ర్యాలీ, బహిరంగసభ నిర్వహించారు. నగరం ఎరుపుమయమైంది.



అనంతరం పాతబస్టాండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో బి.నారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టి అధికారంలోకి మరోమారు వచ్చేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. బిజెపితో జత కట్టేందుకు రాష్ట్రంలోని వైసిపి, టిడిపి పోటీపడడం దుర్మార్గమన్నారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని అమలు చేయలేదని పేర్కొన్నారు. అయినా బిజెపికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కులు, కాబ్జాలను అడ్డుకునేందుకు భవిష్యత్తులో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.



సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ కార్మికులు 8 గంటలు పనిదినాలు సాధించుకున్న రోజే మే డే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటీకరిస్తూ పోతున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను 32 మంది బలిదానం తరువాత సాధించుకుంటూ దానిని బిజెపి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు చూస్తుందని తెలిపారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఊసేలేదని చెప్పారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యుల్ చేస్తామన్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తూనే విస్మరించారని విమర్శించారు. ఆటో కార్మికులు ప్రజలకు మెరుగైన రవాణ సౌకర్యం కల్పిస్తున్నారని అభినందించారు.



సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు, కార్మికులకు ప్రయోజనం చేకూర్చే చట్టాలు, పథకాలను రద్దు చేస్తున్నారని విమర్శించారు. స్కీం వర్కర్లకు జీతాలు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పరిస్థితులు రోజు రోజుకు దిగజారుతూ ఉన్నాయని పేర్కొన్నారు. సైనికుల మరణాలకు బిజెపి ప్రభుత్వమ కారణమని పార్టీకి చెందిన జమ్ముకాశ్మీర్ గవర్నర్‌గా పని చేసి వ్యక్తి చెప్పారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపితో టిడిపి, వైసిపి, జనసేన అంటగట్టడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. మాట్లాడితే దేశభక్తి చేతల్లో కార్పొరేట్లకు దేశ సంపదను అమ్మేస్తున్నారని విమర్శించారు.





సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నష్టాల పేరుతో ఆదానికి, అంబానికి దేశ సంపదను దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ అడ్డుకునేందుకు నిర్వహించే రాస్తారోకోలో కార్మికులు భాగస్వాములు కావాలని కోరారు.



ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మిదేవి మాట్లాడుతూ వైసిపి ప్రతిపక్షంలో ఉంటే ధర్నాలు, ఆందోళలను చేయించిందని, అధికారంలోకి వచ్చాక అడ్డుకుంటుందని విమర్శించారు. జీతాలు పెంచమంటే డబ్బులు లేవన్న ప్రభుత్వం ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు జీతాలు పెంచుతుందని, పారిశ్రామిక వేత్తలకు రాయితీలు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత కోసం పోరాడుతామని చెప్పారు.



ఎల్‌ఐసి యూనియన్ జిల్లా అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, రాజ్యాంగ, కార్మికుల హక్కులను కాలస్తున్నాయని విమర్శించారు. పోస్టల్ యూనియన్ గుర్తింపు రద్దు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రభుత్వ దాడులకు భయపడి మేధావులు మౌనంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సిఐటియు మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామమోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ మాట్లాడుతూ దేశ సంపద ధనికుల చేతిలో ఉందని, పేదలు మరింత పేదరికంలోకి నెట్టపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచిందని, ఆ ప్రయత్నం ఇక్క సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకానికి నిధులు, పని రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.ఎన్.సుబ్బమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మిదేవి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు చంద్రారెడ్డి, ఐఎంఎల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆరు వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై చిత్తూరు 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 43.5 ఓవర్లలో 186 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని యోగానంద 47, రోహిత్ రోషన్ 39 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని అనిల్, మల్లేషన్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 187 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 35 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని భవానీ ప్రసాద్ అద్భుతంగా బ్యాటింగ్లో రాణించాడు. 98 బంతులను ఎదుర్కొని 8 బౌండరీలు ఒక బౌండరీ సిక్స్ సహాయంతో 95 (నాట్ అవుట్) పరుగులు చేశాడు. జట్టు కెప్టెన్ ధరణి కుమార్ నాయుడు 32 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని దీపక్ ఒక వికెట్ తీసుకున్నాడు.

అవార్డు పొందడం ఆనందదాయకం

ప్రజాశక్తి - కడప

అంబేద్కర్ అవార్డు పొందడం చాలా అదృష్టంగా తాను భావిస్తున్నట్లు దాదాస్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ పీఎం రవికుమార్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ నగర కమిటీ అధ్యక్షులు పాస్టర్ సుధీర్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న ఆ ఫెడరేషన్ కార్యాలయంలో నగర కమిటీ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా దాదాస్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ హాజరయ్యారు. అనంతరం ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు. జోసెఫ్, ప్రభుదాసు, విజయ శేఖర్, జ్ఞానానందం, సందీప్ రాజు. అలాగే నగర కమిటీనాయ కులు. సుధీర్, డేవిడ్ రాజు,జాన్సన్, వినోద్,అమర్, అబ్రహం, సిస్టర్స్, అమ్ములు, పుష్ప, తదితర దైవ సేవకులు పాల్గొన్నారు.

డిఎస్‌పి షరీఫ్‌ను కలిసిన సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్



డిఎస్‌పికి బొకే అందజేస్తున్న సలావుద్దీన్

నూతన డిఎస్‌పి ఎం. డి. షరీఫ ను ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ సోమవారం డిఎస్‌పి కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించి పూల బొకేతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యల పై ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. మతసామరస్యానికి ప్రతీకగా జిల్లా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు ఆరిఫ్, చాన్ అలీ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్

కడప : జిల్లాలో గృహ నిర్మాణ పథకం కింద చేపడుతున్న జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో జెసి గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఆర్‌డిఒలు నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, హౌసింగ్ అధికారులు, ఇంజినీర్లతో జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలకు ఇళ్ళు పథకంలో భాగంగా చేపడుతున్న గృహ నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డిఓలు ధర్మ చంద్రారెడ్డి, వెంకట రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖలకు చెందిన నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం నూతన కమిటీ నియామకం

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య అధ్యక్షతన ప్రొద్దుటూరు అసెంబ్లీ నూతన కమిటీ నియామకం సోమవారం కడపలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ నూతన కమిటీకి ఎన్నికైన వారికి నియామక పత్రాలను కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చార్లెస్ చేతుల మీదుగా అందజేశారు. అధ్యక్షుడిగా ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా కలందర్, డ్రైవర్స్ ప్రెసిడెంట్ గా మస్తాన్ వలి, ఆటో యూనియన్ అధ్యక్షులుగా జెబీఉల్లా, ప్రధాన కార్యదర్శిగా బాల మనోహర్ బాబు, కార్యదర్శులుగా చిన్న సుబ్బయ్య, హనీఫ్, షబ్బీర్, అబూబకర్, మౌలాలి, రహ్మాన్, అల్లా బకాష్, జిల్లా కార్యదర్శిగా మహమ్మద్ వల్లిని నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య తెలిపారు. కార్మిక సమస్యలపై పోరాడాలని నూతన కమిటీకి ఎన్నికైన వారికి ఈ సందర్భంగా సూచించారు. అనంతరం మే డే సందర్భంగా కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.



నియామక పత్రాలు అందుకున్న నూతన కార్యవర్గం

సిఎం అరాచకాలు ప్రజలకు వివరిస్తాం

కడప అర్బన్ : సిఎం అరాచకాలను ప్రజలకు వివరిస్తామని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు అన్నారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో జగనాసుర పది తలల బొమ్మను నాయకులు చించిపడేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అవినీతి, నేర చరిత్రపై జగన్ పది తలలతో ఉన్న బొమ్మను మీడియాకు చూపుతూ ఒక్కొక్క అంశాన్ని చదువుతూ ఒక్కొక్క తలను చించుతూ ఏ వన్ ఖైదీ, భూ మాఫియా, మైనింగ్ మాఫియా, రైతుల వ్యతిరేక ద్రోహి, రాబందు, బాబాయిని చంపిన అంతకుడు, కీచకుడు, బస్మాసురుడు, అబద్దాలకోరు, లిక్కర్ మాఫియా, అనే అంశాలపై ప్రజలందరికీ వివరించి చెబుతామన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సానపు రెడ్డి శివకొండ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి, జిల్లా ఉపాధ్యక్షులు నక్కల శివరాం, తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, రాష్ట్ర ఐటీడీపీ ఉపాధ్యక్షులు షేక్. అబిద్, రాష్ట్ర వాణిజ్యం ప్రధాన కార్యదర్శి సానపు రెడ్డి రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి షేక్. నూర్ బాషా పాల్గొన్నారు.

వేసవి సెలవులు ప్రకటించాలి

కడప అర్బన్ : జిల్లాలో యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అన్ని డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులను ప్రకటించాలని గవర్నమెంట్ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగభూషణ్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ బీదం విజయ్ కుమార్ కోరారు. సోమవారం వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్యకు ఆయన ఛాంబర్ వద్ద వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నదృష్ట విద్యార్థుల ప్రయోజనార్థం మే 1 నుంచి 31 వరకు వేసవి సెలవులు ప్రకటించాలని కోరారు. **జిసిటిఎ ప్రతినిధుల ఆధ్వర్యంలో వినతి**

కడప : వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు వేసవి సెలవులను తక్షణం ప్రకటించాలని కోరుతూ సోమవారం ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జిసిటిఎ) ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు డాక్టర్ శశికాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు యోగివేమన విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య వై. పి. వెంకటసుబ్బయ్య ను కలిసి వినతి పత్రం అందజేశారు.

కార్మికుడికి ఆర్థిక చేయూత

పోరుమామిళ్ల టౌన్ : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కార్మికుని ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్నారు టిడిపి యువనాయకులు చెరకూరి రవి. మండలంలోని రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్‌లో దర్గా ఎదురుగా ఆటో మెకానికల్ దుకాణంలో ఆదివారం రాత్రి ఒంటిగంట సమయంలో అగ్ని ప్రమాదం వాటిల్లింది. మెకానికల్ అంగడిలోని సామాన్లు 2 ఆటోలు కాలిపోయాయి. సుమారు రూ. 3 లక్షల నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న రవికుమార్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని రూ.30,000 ఆర్థిక సహాయం అందించారు. కార్మిక దినోత్సవం నాడు కార్మికునికి చేయూత నిచ్చిన రవిని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రామసుబ్బారావు, శ్రీశైలం మాజీ బోర్డు మెంబర్ సీతా వెంకటసుబ్బయ్య, టౌన్ అధ్యక్షులు తుపల్లె మస్తాన్, గురువిరెడ్డి, వెంకటేశ్వర్లు, చెరుకూరి చెన్న కృష్ణయ్య, కిరణ్ పాల్గొన్నారు.



వైభవోపేతంగా బ్రహ్మంగారి రథోత్సవం

బ్రహ్మంగారి మఠం : అశేష జనవాహిని మధ్య సోమవారం బ్రహ్మంగారి రథోత్సవం వైభవంగా కొనసాగింది. ఐదురోజుల రోజులపాటు నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు రథోత్సవ కార్యక్రమంతో బ్రహ్మంగారి మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. విద్యుత్ దీపలంకరణ భక్తులకు కనువిందు చేసేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు.

నాలుగు గంటలైనా పనిచేయాలి

కలసపాడు : మండలంలో ఉపాధి పనులను కనీసం రోజుకు నాలుగు గంటలైనా చేసి వేతనం పొందాలని ఎంపిడిఒ కె.మహబూబ్‌బీ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఎపిఒ రవీంద్రారెడ్డితో కలిసి ఉపాధి పనులపై సమీక్షించారు. కూలీల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. పనులు చేసే ప్రాంతంలో వసతులపై ఆరా తీశారు. ఈనెలలో 5 వేల నుంచి 5,500 వరకు పెంచాలని చెప్పారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను ఉపాధి కూలీలకు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వల్లూరు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దిగువపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను, అందుతున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రఘు, ఎంఇఒ లిల్లెమ్మ, ఇఒపిఆర్‌డి ప్రసాద్, వ్యవసాయాధికారి సాయిజ్యోతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ముజీబ్, ఎపిఎం శైలజ, పంచాయతీరాజ్ ఎఇ పవన్, వైసిపి మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ హరికేశవరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సీతారామ కల్యాణం

పోరుమామిళ్ల : మండలం తోకలపల్లి లోని శ్రీ సీతా లక్ష్మణ హనుమత్‌సమేత శ్రీ పట్టాభిరామ స్వాముల వారి వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు కనుమల్ల సత్యనారాయణ శర్మ ే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

వాడవాడలా మేడే సంబరాలు


రిమ్స్ వద్ద కేక్ కట్ చేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని కార్మికులు, శ్రామికులు ఘనంగా జరుపుకున్నారు. వామపక్షాలు, వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో ఎర్రజెండాలు ఆవిష్కరించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా వాడవాడలా అరుణ పతాకం రెపరెపలాడింది. కార్మికులు ఎర్రజెండాలు చేతపట్టి ఎక్కడికక్కడ దండులా కదిలారు. ప్రదర్శనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలపై నిప్పులు చెరిగారు.

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా సోమవారం వాడవాడలా ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. నగరంలోని రిమ్స్‌లో ఏపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 137వ మేడే నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 1886, మే ఒకటిన అమెరికాలోని చికాగో నగరం, హే మార్కెట్ సెంటర్ వద్ద లక్షలాదిమంది కార్మికులు 12 గంటల పని దినాలు రద్దు చేసి 8 గంటలు అమలు చేయాలని శాంతియుత నిరసన ద్వారా ఐక్యంగా డిమాండ్ చేశారని పేర్కొన్నారు. నిరంకుశ అమెరికా పాలకులు కార్మికులపై కాల్పులు జరిపి వేలాది మంది కార్మికుల రక్తం కళ్లజూశారని చెప్పారు. చివరకు ఎర్రజెండా డిమాండ్లను అన్ని దేశాలు అనివార్యంగా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచుతూ జీవోలు ఇస్తుందని విమర్శించారు. శారీరక, మానసిక శ్రమ చేసే కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు మళ్లీ ఆధునిక బానిసలుగా తయారు చేయడానికి ప్రయత్నించడమేనన్నారు. కార్యక్రమంలో యూనియన్ రిమ్స్ విభాగం అధ్యక్షులు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షులు భాస్కర్, కమిటీ సభ్యులు జయరాం, సుబ్బరాయుడు, పవన్, దస్తగిరి, అన్నమ్మ, రాజ్యం, మునెమ్మ, నారాయణమ్మ, లక్ష్మి, లలితమ్మ, గంగమ్మ, జయమ్మ, మరియమ్మ, 200 మంది కార్మికులు, ఉద్యోగులు, వివిధ విభాగాలలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

– బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కళ్యాసుధాకర్, ఆకుల సుబ్బరావు బిఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయం ఎదుట మేడే జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, పెన్షనర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

– సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ పాతబస్టాండులోని సిపిఎం జిల్లా కార్యాలయం ఎదుట మేడే స్ఫూర్తితో సిపిఎం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఓబులేసు, మహబూబ్ తార, గోవిందు, రామాంజనేయరెడ్డి, తిమ్మప్ప, మస్తాన్, మల్లయ్య పాల్గొన్నారు.

– యుటిఎఫ్ భవన్ ఎదుట యుటిఎఫ్ జెండాను రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేబ్‌బాబు ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దావుద్దీన్, కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహమ్మద్, నాయకులు కిరణ్‌కుమార్, అబ్దుల్ ఘనీ, శ్యాంసుందర్ బాబు, చెన్నకేశవులు, కొండయ్య, ప్రభాకర్, స్వతంత్ర బాబు పాల్గొన్నారు.

–రామకృష్ణ నగర్‌లో ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జెండాను సీనియర్ నాయకులు మంతా వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి.ఎం.ఓబులేసు, మహబూబ్ తార, శ్రీను, వినోద్ కుమార్, రమణమ్మ, చెన్నయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

– ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కార్యదర్శి సుంకర రవి పాత మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కంచపాటి తిరుపాల్, శ్రీరాం, ఇత్తడి ప్రకాష్, శ్రీధర్‌బాబు, కిరణ్‌కుమార్, అనిబాబు, మస్తాన్, శివ, శ్రీను, ఓబులేసు, కిషోర్, దాస్, కార్మికులు పాల్గొన్నారు.

– సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ గ్యాస్ ప్లాంట్ వద్ద సిఐటియు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కృష్ణ, భాస్కర్‌రెడ్డి, వేణు, డి.ఎస్.రెడ్డి, ఓబులేసు, బి.సుబ్బరాయుడు, ఎ.ప్రసాద్, ఎం.మునీంద్రరెడ్డి, డి.సి.సుబ్బయ్య, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. **కలసపాడు :** మండలంలో మేడే వేడుకలను సిఐటియు నాయకులు ఓ .విజయమ్మ ఆధ్వర్యంలో జెండాను ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గ్రామ్య కార్మిక సంఘం నాయకులు, హరిత రాయబారులు ఆవాజ్ కమిటీ నాయకులు పాల్గొన్నారు. **వల్లూరు :** సిఐటియు ఆధ్వర్యంలో కమలాపురం పట్టణంలో మే డే జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి ,జి.రాజమణి పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్ :** స్థానిక విద్యుత్ స్టేషన్, ప్రభుత్వాస్పత్రిలో సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. భైరవ ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.చెన్నయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు జ్యోతి, రేణుక, రమణమ్మ, పావని, రామదేవి, పీరమ్మ, గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ వెంకట నాగేంద్ర, ఎ ఎన్ ఎం లు,ఆశా లు,సిపిఎం నాయకులు రవి,బషీర్య, మహబూబ్ పీరా,షరీఫ్, భీమా, మాబు, గురయ్య, లక్ష్మమ్మ, ఐద్వా నాయకులు బీబీ,మేరీ పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** మండల కేంద్రంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ. గోపాలకృష్ణయ్య పిలుపునిచ్చారు. సిఐటియు జెండాను ఆవిష్కరించారు. రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు చిన్న సిద్దయ్య శ్రీనివాసులు రెడ్డి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాగలక్ష్మి పాల్గొన్నారు. **ఒంటిమిట్ట:** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే డే వేడుకలను ఒంటిమిట్టలో ఘనంగా నిర్వహించారు వ్యవసాయ కార్మిక జిల్లా ఉపాధ్యక్షుడు కోనేటి నరసయ్య, మండల వ్యవసాయ కార్మికులు, సిఐటియు, టిఎన్‌టియుసి నాయకులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని సిఐటియు స్థూపం వద్ద సోమవారం నాయకులు జెండా ఎగురవేసి, మిఠాయిలు పంచిపెట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజమణి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉమాదేవి, సుబ్బలక్షుమ్మ, కుసుమ, సుబ్బలక్షుమ్మ, ప్రసన్న, శివలీల, దస్తగిరమ్మ, భాను, లలితమ్మ, కార్మిక నాయకులు రాజు, వరదారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు రోశయ్య, రామ్‌ప్రసాదు, మహబుబ్ బాషా, సుబ్బయ్య పాల్గొన్నారు.

– ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడేను పురస్కరించుకొని ఆర్‌టిపిపిలో ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి, నాయకులు హరి ఓబుల్‌రెడ్డి, శేఖర్, నరసింహులు, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్, గంగయ్య, పుల్లారెడ్డి పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కూడలి వద్ద సోమవారం ఆటో కార్మికులతో కలిసి కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆటో కార్మికుల షర్ట్ ధరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రమని గౌరవిద్దాం.. చెమట చుక్క విలువను కాపాడుకుందాం.. కలిసి కట్టుగా మన హక్కులపై పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లాజానీ, మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శీను, నాయకులు వేణుయాదవ్, బుజ్జి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

– మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ పిలుపునిచ్చారు. కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మనోహర్ పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ బానిస చాకిరీకి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఎనిమిది గంటల పని దినాల కోసం ప్రపంచవ్యాప్తంగా పోరాటాలు సాగించారని తెలిపారు. ఆ పోరాటాల ఫలితంగానే 1886 మే 1న ఎనిమిది గంటల పని దినాలు అమలైందన్నారు. దేశంలో, రాష్ట్రంలో సంఘటిత రంగ కార్మికులైన అంగన్వాడీ, ఆశ, యానిమేటర్స్ వంటి రంగాల కార్మికులు సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా రంగాల సమస్యలపై సిఐటియు రాజీలేని పోరాటం సాగించిందన్నారు. తద్వారా కొన్ని సమస్యలను పరిష్కరించుకోగలిగామని తెలిపారు. జిల్లా మున్సిపల్ వర్కర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులైన ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, వారికి పథకాలు అందేలా చూడాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను వారి సంక్షేమానికి మాత్రమే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు దాసు, విజయ్, వినయ్‌కుమార్, అంగన్వాడీ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, సిఐటియు ఆటో సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆదామ్, ప్రసాద్‌రెడ్డి, నాయకులు దస్తగిరి, నరేంద్ర, అబ్రహం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివ, రాజు పాల్గొన్నారు. **మైలవరం :** పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల దినోత్సవం మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కులు సాధించుకుందాం అని సిఐటియు మండల నాయకులు కొండయ్య పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా మైలవరం ఇరిగేషన్ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాసు, సంజీవ రాయుడు, ధనుంజయ,లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** కార్మికుల సంక్షేమానికి టిడిపి పెద్దపీట వేసిందని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్ పేర్కొన్నారు. కార్మిక దినోత్సవం పురస్కరించుకొని స్థానిక టిడిపి కార్యాలయం వద్ద టీఎన్‌టియుసి జెండాను టిడిపి రాష్ట్ర నాయకుడు ముక్తియార్ ఎగురవేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇవి సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, తాటి శ్రీనివాస్ యాదవ్, టిఎన్‌టియుసి నాయకులు పాల్గొన్నారు. **వేంపల్లె :** కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కార్మిక జెండాను భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎగురవేశారు. కార్యక్రమంలో చల్లా బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓబులేసు, గౌరవాధ్యక్షులు రమణయ్య, దస్తగిరి, నాగేశ్వరరావు, బాబు, ఆంజనేయులు, జమాల్‌బాషా, సుబ్బారావు, చలపతి, శ్రీనివాసులు, నాగమల్లయ్య, నాగేంద్ర, బాలగంగులు, వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య, పాల్గొన్నారు **ప్రొద్దుటూరు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, దేశసంపదకు మూల కారకులు



ప్రొద్దుటూరులో ర్యాలీ చేస్తున్న కార్మిక నాయకులు

కార్మికులే అని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మేడే సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఎర్రజెండా ఆవిష్కరించి, కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చంటి, గుర్రమ్మ, నీతమ్మ, అన్నపూర్ణమ్మ, రమణమ్మ, శాంతి, ప్రమీలమ్మ, మహిళా సంఘం నాయకులు వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, మున్సిపల్ యూనియన్ నాయకులు రాఘవేంద్ర, మోహన్, రవి, ఓబయ్య, సురేష్, సుధాకర్, దినేష్ పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** పట్టణంలో భవన నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో, అలాగే పలుచోట్ల మే డే దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణపల్లి టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మే డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన నివాసంలో కార్మికులు గురుప్రసాద్, శ్రీనివాసులు, రాజు, అనురాధ, కైలాసం, నాగరాజుకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శివ, ఆకుల ప్రసాద్, గౌకనపల్లి తేజవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, పి.రామాంజనేయులు, పూల నరసింహులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


సిపిఎం జిల్లా కార్యాలయం ఎదుట..


ఐటిసి వద్ద..


ఎర్రగుంట్లలో..


పాత మున్సిపల్ కార్యాలయం వద్ద..

అన్యాయాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం శోచనీయం

వేంపల్లె : స్థల వివాదం కోర్టులో ఉండగా కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ లేకున్నా వైసిపి నాయకులు ఆ స్థలంలో యధేచ్ఛగా ప్లాట్లు వేసుకొని అమ్ముకొంటూ ఉంటే దాన్ని టిడిపి ఇన్‌చార్జి బీటెక్ రవీంద్రారెడ్డి ప్రశ్నిస్తే నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం శోచనీయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. వేంపల్లె పోలీసుస్టేషన్లలో ఉన్న టిడిపి నాయకులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బిటెక్ రవీంద్రారెడ్డి అన్యాయాన్ని ప్రశ్నించినందుకు పోలీసులు ఏకపక్షంగా కేసులు నమోదు చేశారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా అన్యాయాన్ని ప్రశ్నిస్తునే ఉంటామని తెలిపారు. ప్రజలు కూడా వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, యూనిట్ సభ్యుడు జబీవుల్లా, డక్కా రమేష్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు మెదర రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణాభివృద్ధే వైసిపి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అమ్మగారిపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రతి గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఎంపీ వివరించారు. ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మిగాయత్రి, వేంపల్లె సర్పంచు రాచినేని శ్రీనివాసులు, అయ్యవారిపల్లె సర్పంచు రామగంగిరెడ్డి, లక్ష్మిపావని, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అధి కారులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌ది ఘనమైన నేర చరిత్ర

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి పది తలల రావణాసురుడని, ఒక్కో తలకు ఒక్కో నేర చరిత్ర ఉందని టిడిపి రాష్ట్ర నాయకులు విఎస్ ముక్తియార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో లిక్కర్, మైనింగ్, భూ మాఫియా అధికమయ్యాయన్నారు. బద్వేలును రెవెన్యూ డివిజన్‌గా మార్చి వేల కోట్ల విలువ చేసే 6 వేల ఎకరాల భూమిని దండుకున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు జగన్‌కు సరైన బుద్ధి చెపుతారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు కూతుబుద్దీన్, రాజుపాలెం మండల అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, మాజీ కౌన్సిలర్ బాబయ్య, బోగాల లక్ష్మీ నారాయణమ్మ, లక్ష్మీదేవి, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

ఖాజీపేట : అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగసానిపల్లి సమీప పొలాల్లో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి పంటను ఆయన పరిశీలించారు. ఎఒ నాగార్జున, ఆయన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

చింతకొమ్మదిన్నె : భారత ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా ఆటోను ఢీకొన్న కారు సంఘటనలో ఆటో డ్రైవర్ షేక్ మహమ్మద్ గౌస్ (30) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. జె.నారాయణపురానికి చెందిన షేక్ మహ్మద్ గౌస్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. గ్రామం నుంచి ఆటోతో కడప వెళ్తుండగా కడప నుండి రాయచోటి వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొంది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులోని సిమెంటు గొడౌన్ వెనుక ఉన్న కంప చెట్ల మధ్య గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైంది. దుర్వాసన వస్తుండడంతో పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ తిరుపాల్ నాయక్ సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించగా మృతదేహం కుళ్ళిపోయింది. దీంతో ఆ వ్యక్తిని గుర్తించలేక పోయారు. దాదాపు 4 రోజుల క్రితం మగ వ్యక్తి మృతి చెందినట్లు ఉందని పోలీసులు అంటున్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు


రోడ్లపైనే ప్రవహిస్తున్న వర్షపు నీరు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీ పరిధిలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ఓవైపు డ్రయినేజీ కాలువల్లేక నీరు నిలిస్తే.. మరోవైపు కాలువలు ఉండి కూడా నీరు నిలుస్తోంది. సముద్రమే లేని ఊరికి ఓడరేవు తీసుకువస్తానని అదేదో సినిమాలో చెప్పినట్లు.. కోస్తా, నెల్లూరు జిల్లాలో ఉండవలసిన చేపల చెరువులు మన ప్రజాప్రతినిధులు ఎర్రగుంట్లకు తీసుకువచ్చారంటూ స్థానిక ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. అటు ముద్దనూరు రోడ్డు చివర నుండి ఇటు కడప రోడ్డు చివర వరకు ఎక్కడ చూసినా రోడ్లు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయంటూ ప్రజలు వాపోతున్నారు. వర్షం వస్తే తిప్పలు తప్పడం లేదని ప్రజలు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. అభివృద్ధి పేరుతో నాలుగు లైన్ల రహదారి, డ్రయినేజీ అంటూ రూ.33 కోట్ల ప్రజాధనాన్ని నాయకులు, అధికారులు దుర్వినియోగం చేశారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాజామణి మాట్లాడుతూ రోడ్డు, డ్రయినేజీ అంటూ రూ.33కోట్లు ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు రోగాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే రోడ్లు చేపల చెరువులను తలిపిస్తున్నాయని కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం సభ్యులు చంద్రగిరి రెడ్డెయ్య, రామిరెడ్డి తెలిపారు. కాలువలకు ఉన్న రంధ్రాలు ఎక్కడో పైన వేయడం వల్ల నీరు రోడ్ల వెంబడి పారుతోందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని అధికారులను, నాయకులను ప్రజలు కోరుతున్నారు.

రహదారులు జలమయం

ముద్దనూరు : ఆదివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి మండల కేంద్రంలోని రహదారులు, పలు వీధులు జలమయమయ్యాయి. పాత బస్టాండ్ నుండి రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో నీరు నిలవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రధాన గేటు వద్ద నీరు నిలవడంతో తీవ్ర అసౌకర్యంగా మారింది. ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఉన్న జగనన్న కాలనీ బురదమయమైంది.

శకునికి మరో రూపం చంద్రబాబు

జమ్మలమడుగు : ప్రజల అభివృద్ధికి అడుగడుగునా చంద్రబాబు అడ్డుపడుతూ శకునిలా తయారయ్యారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 9,10 వార్డు సచి వాలయం పరిధిలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందేవి కావన్నారు. ముఖ్యమంత్రి జగన్ సచివాలయం వ్యవస్థను ప్రవేశపెట్టి మధ్యవర్తి లేకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చేశారన్నారు. 9,10 వార్డు సచివాలయం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో 9 వార్డు ఇన్‌ఛార్జి వేణుయాదవ్, కో–ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, నాయకులు కిరణ్ కుమార్, హనుమంత్‌రెడ్డి, చంద్రమౌళి, మున్సిపాలిటీ బాల మల్లేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ భాషా, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి : ఎంపిపి

మైలవరం : మండల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపిపి సావిత్రమ్మ కోరారు. మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. నవరత్న పథకాల అమలును అవినీతికి ఆస్కారం లేకుండా అర్హత గల ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది పిల్లలు చేరేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. పలు శాఖల అధికారులకు సూచలను చేశారు. ఎంపిడిఒ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసి మహాలక్ష్మి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిటెక్ రవి దౌర్జన్యానికి బెదరం

వేంపల్లె (చక్రాయపేట) : మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి దౌర్జన్యానికి చక్రాయపేట మండలంలో ఎవరూ బెదరరని జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం నాగులగుట్టపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి స్థలాల కోసం పాతిన రాళ్లను, రోడ్లును బిటెక్ రవీంద్రారెడ్డి జెసిబిలతో తొలగించడం శోచనీయం అన్నారు. రాళ్లు పాతే సమయంలో స్థలం కోర్టులో ఉందని చెప్పాలని, అప్పుడు ఎందుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. చక్రాయపేట మండలంలో సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి కృషి వల్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. భూమిపై హక్కు ఉంటే ఆధారాలు చూపించాలన్నారు. ఆధారాలు చూపించకుండా దౌర్జన్యం చేస్తే ఇక్కడ ఎవరూ మౌనంగా ఉండరని ఆయన హెచ్చరించారు.

మిరప రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు


మిరప పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అకాల వర్షానికి దెబ్బతిన్న మిరప పంట రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎస్. ఉప్పలపాడు గ్రామంలో సోమవారం వర్షాలకు దెబ్బతిన్న మిరప పంటను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాలకు ఎస్.ఉప్పలపాడు రైతుల పంటలు దెబ్బతిన్నాయన్నారు. వంటనే అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేయా లన్నారు. తక్షణం రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిరప పంటపై ఉన్నతాధికారులతో చర్చించి నష్టపరిహారం అందేలా చూస్తా మన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.